క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఆశ్రమంలో అన్నదానం



అనాథ ఆశ్రమం పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న సురేష్ రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాదరావు జన్మదిన వేడుకలను మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గొటివాడలోని జనరేషన్ యువ అనాథ ఆశ్రమంలో ఆ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ కేక్ కట్ చేసి ఆశ్రమంలోని పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

గాయని సాహితికి వేటూరి పురస్కారం

దాబాగార్డెన్స్: వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితికి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత వేటూరి 98వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళాపీఠం 'ఎదలో మోహన లాహిరి' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటూరి పేరిట పురస్కారానికి సాహితీ ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సాహితీ, రమేష్ పట్నాయక్ ఆలపించిన వేటూరి గీతాలు అలరించాయి. గంటి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, ఉసిరికాయల చంద్రశేఖర్, సుహాసిని ఆనంద్, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- విజినిగిరిపాలెంలో ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



విజిగిరిపాలెంలో మహిళలకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్కు అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వవార్డు పరిధి అడవివరం దరి విజినిగిరిపాలెంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. భీమిలి నియోజకర్గం పరిధిలోని జీవీఎంసీ 89, 98వవార్డులకు సంబంధించి మొత్తం 2980 డ్వాక్రా మహిళలకు నాలుగో విడతగా 2కోట్ల 3లక్షల 96వేల 173 రూపాయల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముత్తంశెట్టి మాట్లాడారు. ప్రజా సంక్షేమం,రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రతీ పేదవాడు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీలు చూకుండా, లంచాలు లేకుండా సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి ఎలాంటి సమస్య ఉన్నా ఇంటి దగ్గరే పరిష్కారం అయ్యే విధంగా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వానికి ఆదాయం లేకపోయినా, ఖర్చులు పెరిగినా సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారన్నారు.

విశాఖ జిల్లాలో డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ. 750 కోట్లు అందించారని చెప్పారు. 89, 98వ వార్డులకు సంబంధించి 8 కోట్ల 15లక్షల 84వేల 692 రూపాయలు అందించామన్నారు. అలాగే 98వ వార్డులో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల కింద ప్రజలకు రూ. 125 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. భారతదేశం మొత్తంలో ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కూడా జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. ఎవరెన్ని మాటలు చెప్పినా వినకుండా మహిళలంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడవాలని పిలుపునిచ్చారు. సింహాచలం దేవస్థానం భూసమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికిదాసరా లబ్దిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, లోగిశ మాధవవరావు, మజ్జి ధర్మా, లండ రమణ, శిడగం తాతబాబు, ఆర్.వర్మ, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముత్తంశెట్టి తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం

పెందుర్తి: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని.. అవి పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని నేవీ చీఫ్ పెట్టీ ఆఫీసర్ రమణ అన్నారు. స్థానిక భాష్యం స్కూల్‌లో నిర్వహించిన ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్-2024లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్‌ఈవో వెంకట్, ప్రిన్సిపాల్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

గాంధీ మార్గం అనుసరణీయం



మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేముడు తదితరులు



అడవివరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెందుర్తి: మండలంలో మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అహింసా మార్గంలో పోరాడి,యావత్ భారతజాతికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని కొనియాడారు.కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారులు,వైఎస్సార్సీపీ నాయకులు గొరపల్లి అప్పారావు,సింహాచలం, కంచిబోయిన సంతోష్,చిక్కాల సతీష్,సుంకర శేఖర్,కండిబోయిన మాధవి,కొత్తపల్లి అప్పలరాజు,మోహన్,శివ పాల్గొన్నారు.

అడవివరంలో..

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరం దరి గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోర కృష్ణారెడ్డి, లోగిశ మాధవరావు, లండ రమణ, దమ్ము ఎర్రాజీ, దమ్ము శ్రీను, యలమంచిలి సూరిబాబు, రీసు రాము తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



బంతి, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



విశేష అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి, చామంతి, గజమాలలతో అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జీరు వాసురెడ్డి ఆర్థిక సహకారంతో అలంకరణ పూర్తి చేశారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి సేవలో ఉంటున్న పోతల నరసయ్యమ్మకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, ఓఎస్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు 9 రకాల పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విశాఖ ఉక్కులో పరిస్థితులు ఆందోళనకరం



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

గాజువాక: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులు నానాటికీ ఆందోళనకరంగా మారుతున్నాయని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాన్ జేసీఎం సభ్యుడు డి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోగా, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రిక్రూట్‌మెంట్ జరగడంలేదని, కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉందని పేర్కొన్నారు. నిర్వాసితుల కోటా కూడా ఇవ్వడంలేదన్నారు. వివిధ కారణాలను చూపించి కార్మికులను తొలగించడం సరి కాదన్నారు. మరోపక్క కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ సమస్యలపై ప్రధాన కార్మిక సంఘాలు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ అంశాలపై 16 కార్మిక సంఘాల తరఫున తాము ప్రశ్నిస్తే తమపై నిందలు వేస్తున్నారన్నారు. ఆర్థిక ప్రయోజనాలపై కార్మిక సంఘాలు ఏమీ చేయని కారణంగా కార్మికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. ప్రధాన సంఘాలు స్పందించకపోయినా తమ శక్తి మేరకు పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, నక్కా వెంకట రమణ, గుమ్మడి నరేంద్ర, మహాలక్ష్మి నాయుడు, లక్ష్మణ్, డేవిడ్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్ట్



గుల్లేపల్లిలో పట్టుబడిన మద్యం బాటిళ్లు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న మల్లునాయుడుపాలేనికి చెందిన వ్యక్తి నుంచి 48 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం నిర్వహించిన దాడుల్లో బయిలపూడి బంగారయ్య(53) అనే వ్యక్తి ప్లాస్టిక్ గోనె సంచిలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. వీటి విలువ రూ.7,200 వరకు ఉంటుందన్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చెక్‌పోస్టు వద్ద

మండలంలోని అనకాపల్లి-అనందపురం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మర్రిపాలెం చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి 6 మద్యం బాటిళ్లతో పట్టుబడినట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో నిర్వహించిన తనిఖీల్లో కారులో అనకాపల్లి వైపు మద్యం తరలిస్తుండగా ఒడిశాకు చెందిన తస్సార్ రంజాన్ మిశ్రాను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

ల్యాండ్ ఫిల్ నిర్మించవద్దు

పరవాడ: తాడి సమీపంలో ల్యాండ్ ఫిల్ నిర్మాణంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీన్ని టీడీపీ, జనసేన, ప్రజా సంఘాలు వ్యతిరేకించాయి. అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి మాట్లాడుతూ ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తెలియజేస్తే వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో తాడి, తానాం, లంకెలపాలెం, పరవాడ, లేమర్తి, ఈ.బోనంగి, సాలాపువానిపాలెం తదితర ప్రాంతాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని అనారోగ్యంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించకుండా ల్యాండ్ ఫిల్ నిర్మాణం చేపట్టవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీబీ అధికారులు ప్రసాదరావు, నాగిరెడ్డి, అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ పి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు



రిజిస్ట్రార్ స్టీఫెన్‌తో ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎన్ఐటీ రూర్కెలా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అట్మాస్ఫియరిక్ సైన్స్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం సందర్శించారు. పురాతనమైన వాతావరణ-సముద్ర అధ్యయన శాస్త్ర విభాగంలో ఉన్న మౌలిక వసతులు, ప్రాజెక్టులు, మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ పరికరాలను ప్రత్యక్షంగా తిలకించారు. విభాగ ఆచార్యులతో మాట్లాడి, బోధన, పరిశోధన వసతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని సందర్శించడం, ఇక్కడ ప్రత్యేకతలను తెలుసుకోవడంపై ఎన్ఐటీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల బృందం ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సునీత, ఆచార్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పా లతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉద యం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి ఒకటిన సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

విస్టమ్ కళాశాలను సందర్శించిన యూఎస్ బృందం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న అలెగ్జాండర్ మెక్ లారెన్ తదితరులు



విస్టం కళాశాల విద్యార్థులతో అలెగ్జాండర్ మెక్ లారెన్ బృందం

పెందుర్తి: మండలంలోని విస్టం కళాశాలను మంగళవారం యూఎస్ కాన్సులేట్, పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ బృందం సందర్శించింది. ఆయనతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన మెలిస్సా నందు, జో క్రిస్టోఫర్ లు కళాశాలను సందర్శించి యూఎస్ కాన్సులేట్ హైదరాబాద్ సహకారంతో గ్లోబల్ వర్చువల్ స్కూల్ అందిస్తున్న ఆంగ్ల భాషా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 3 బ్యాచ్‌ల విద్యార్థులను అభినందించారు. వారు యూఎస్ విద్య, ఆంధ్రా యూనివర్సిటీలోని అమెరికన్ కార్నర్ ద్వారా పొందగలిగే వివిధ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విస్టం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు.

ఎంపీడీవో, ఎంఈవోలకు సత్కారం



ఎంపీడీవో హేమసుందర్రావును సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు



ఎంఈవో పద్మజను సత్కరిస్తున్న నాయకులు

పరవాడ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు బదిలీపై వెళ్లిన పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఎంఈవో పద్మజను మంగళవారం ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో హేమసుందర్రావు వెస్ట్ గోదావరికి బదిలీ అయ్యారు. ఎంఈవో పద్మజ ఈస్టుగోదావరికి పదోన్నతితో కూడిన బదిలీపై వెళ్లారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైస్ఎంపీపీ బి.అప్పలరాజు, మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సినిమా సాహిత్యంతో విలువలపై అవగాహన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం-జనరంజక వీణానాదం'అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒకవైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తుందన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.శంకరరావు మాట్లాడుతూ సాహిత్యంలో అద్భుతమైన పాటలు రాసి సాహిత్యపు విలువలు పెంపొందించిన సినీ గేయ రచయత దాశరథి అని కొనియాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన 90వ పుస్తకం రావిశాస్త్రి రచనలు-అభ్యుదయ దృక్పథం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అంకితం చేసినట్టు ఆచార్య సిమ్మన్న తెలిపారు.